

- తాగునీటికి ప్రజల ఇక్కట్లు
- సాగర్ జలాల కోసం ఎదురుచూపు
- నీటి విడుదల కోసం కేఆర్‌ఎంబీకి లేఖ
- నేటికీ అనుమతి ఇవ్వని అధికారులు
- 8 నుంచి నీటి విడుదలపై అనుమానం ?

నిండుకున్న చెరువులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. తాగునీటి ఎద్దడిపై అధికార యంత్రాంగం, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. తాగునీటి సమస్య పరిష్కారంలో మున్సిపాల్టీలు, పంచాయతీలు విఫలమవుతున్నాయి. గత 30 ఏళ్లలో లేనివిధంగా తాగునీటి కష్టాలను చలికాలంలో ఎదుర్కొనడం ఇదే ప్రథమమని ప్రజలంటున్నారు. తాగునీటి చెరువుల్లో నీటి నిల్వలు అడుగంటాయి. ఇందుకు సంబంధించిన నివేదికలను అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. పురపాలక సంఘాల్లో రోజురోజుకు తాగునీటి సమస్య జటిలమవుతుంది. వేసవిలో ఉండాల్సిన పరిస్థితులు చలికాలంలోనే నెలకొన్నాయి. వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి మున్సిపాల్టీల్లో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆయా మున్సిపాల్టీలలో రెండు రోజులకు ఒక పూట తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆయా పట్టణాల్లోని తాగునీటి చెరువుల్లో నీటి నిల్వలు నిండుకున్నాయి. చివరకు నరసరావుపేట మునిసిపాల్టీలో కూడా నీటి ఇక్కట్లను ఎదుర్కోవాల్సి పరిస్థితిని యంత్రాంగం కల్పించింది. నరసరావుపేటలో కూడా రోజుకు ఒక పూట నీటి సరఫరా చేస్తున్నారు. సత్వరం సాగర్ నుంచి నీరు విడుదల చేయకపోతే మున్సిపాల్టీలలో నీటి సరఫరా కష్టంగా మారే పరిస్థితులున్నాయి. గ్రామాల్లోని చెరువుల్లో కూడా నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. ఈ చెరువుల కు కూడా నీటి సరఫరా తక్షణావస రం అని అధికారులు చెబుతున్నారు.

తాగునీటి చెరువుల్లో నీరు నిండుకుంది. నీటికి కటకటతో పల్లె పట్టణవాసులు అల్లాడుతున్నారు. నీటి వనరులు రోజురోజుకు అడుగంటి పోతుండటంతో తాగునీటి సరఫరాపై అధికారులు చేతులెత్తేస్తున్నారు. అరకొర సరఫరా చేస్తోన్న నీటితో అవసరాలు తీర్చుకోలేక ప్రజలు అల్లాడుతున్నారు. గత నెలలో భారీ వర్షాలు కురిసినా.. ఇంకా వేసవి రాకపోయినా ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో నెలకొనే తాగునీటి ఎద్దడిపై ప్రజలు భయాం దోళనలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లావ్యాప్తంగా, గుంటూరు జిల్లా పరిధిలోని కొన్ని మండలాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో రోజుమార్చి రోజు మరికొన్ని మున్సిపాలిటీల్లో రెండు మూడు రోజుల కోసారి సరఫరా అవుతుంది. ఇక పల్లెల్లో అయితే ట్యాంకర్ల ద్వారా అరకొరగా సరఫరా చేస్తున్నారు. తాగునీటికి కటకట పరి స్థితుల్లో నాగార్జునసాగర్ డ్యాం నుంచి నీటి విడుదల కోసం అధికారులు లేఖ రాసినా కేఆర్‌ఎంబీ నుంచి ఇంత వరకు అనుమతులు రాలేదు.



నీటి విడుదలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేసి చెరువులు నింపితేనే తాగు నీటి ఇక్కట్లు తీరతాయి. అయితే డ్యాం నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా కూడా కనిపించడంలేదు. అయితే డ్యాంపై తెలంగాణ పోలింగ్ రోజున అలజడి సృష్టించిన ప్రభుత్వం తాగునీటి సమస్య రోజురోజుకు జటిలమవుతున్నా ఎందుకు చోద్యం చూస్తుందన్న విమర్శలున్నాయి. కేఆర్‌ఎంబీ అనుమతి లభిస్తేనే నీటి విడుదల జరిగే పరిస్థితి. నీటి విడుదల కోసం కేఆర్‌ఎంబీపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాల్సి ఉన్నా పాలకులు పట్టించుకోవడంలేదన్న అభిప్రాయం నెలకొంది. షెడ్యుల్ ప్రకారం ఈ నెల 8 నుంచి 5 టీఎంసీలు, మరో విడత ఏప్రిల్ నెల మొదటి వారంలో మరో 5 టీఎంసీలు తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి నీటిని విడుదల చేయాలి. ప్రభుత్వం గతంలో విడుదల చేసిన ఈ షెడ్యూల్ ప్రకారం నీటి సరఫరాపై అనుమానాలు నెలకొన్నాయి. తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేయాలని కేఆర్‌ఎంబీకి జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి లేఖ రాశారు. అయితే శుక్రవారం వరకు ఎటువంటి అనుమతులు రాలేదు. కేఆర్‌ఎంబీ నుంచి అనుమతులు లేక పోవడంతో నీటి విడుదలపై సందేహాలు నెలకొన్నాయి. నీటి విడుదల కోసం పంచాయతీలు, మున్సిపాల్టీలు ఎదురుచూస్తున్నాయి. డ్యాం నుంచి నీటి విడుదలకు ఇంకా అనుమతులు రాలేదని జనవనరుల శాఖ ఎస్సీ వరలక్ష్మి తెలిపారు.



లావుకూ.. నో?



- గుంటూరు వెళ్లమని జగన్ హుకుం
- అందుకు సుముఖత చూపని ఎంపీ
- మార్చొద్దని ఎమ్మెల్యేలు చెప్పినా ఆలకించని వైనం
- నరసరావుపేటలో అయితేనే పోటీ చేస్తానని చెప్పిన శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కూడా సీఎం జగన్ మొండిచేయి చూపించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గుంటూరు ఎంపీగా పోటీ చేయమని హుకుం జారీ చేశారు. దాంతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఆ నియోజకవర్గంలోని కొంతమంది ఎమ్మెల్యేలు కూడా విస్మయానికి గురయ్యారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చి నిజాయితీగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి కేంద్రీకరించిన ఎంపీకి ఈ పరిస్థితిని కల్పించడంపై అంతా అవాక్కవుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు కూడా తొలుత శ్రీకృష్ణదేవరాయలును గుంటూరులో పోటీ చేయమని చెప్పి తీరా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక నరసరావుపేటకు పంపారు. అయినా ఆయన ఏమాత్రం అభ్యంతరం పెట్టకుండా నరసరావుపేటకు వెళ్లి అక్కడ రాజకీయ ఉద్ధండుడు రాయపాటి సాంబశివరావుపై పోటీ చేసి లక్షకు పైగా మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచిన రోజు నుంచి నియోజకవర్గ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ నిధులను మంజూరు చేయించారు. ఇవేమి పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పుడు మళ్లీ నియోజకవర్గం మారాల్సిందిగా వైసీపీ అధిష్ఠానం ఒత్తిడి చేయడంపై పార్టీ పల్నాడు జిల్లా శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వెల్లుబుకుతున్నది. తాజాగా శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయానికి శ్రీకృష్ణదేవరాయలును పిలిచి వచ్చే ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగాల్సిందిగా సీఎం జగన్ సూచించారు. అయితే అందుకు ఆయన సుముఖత చూపలేదు. తాను నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి అయితేనే ఎన్నికల్లో పోటీ చేస్తానని, కాదంటే బరి నుంచి తప్పుకుంటానని స్పష్టం చేసినట్లు సమాచారం. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును వైసీపీ అధిష్ఠానం పిలిచిందన్న విషయం ముందుగానే తెలుసుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు జంగా, మర్రి రాజశేఖర్ సీఎంవోకి వెళ్లి తమకు శ్రీకృష్ణదేవరాయలునే ఎంపీ అభ్యర్థిగా కేటాయించాలని చెప్పి వెనుతిరిగినట్లు సమాచారం. అయినప్పటికీ సీఎం జగన్ వారి విజ్ఞప్తులను ఏమాత్రం పరిగణన లోకి తీసుకోకుండా శ్రీకృష్ణదేవరాయలును గుంటూరు వెళ్లాల్సిందేనని చెప్పి పంపినట్లు తెలిసింది. క్లీన్ ఇమేజ్ ఉన్న శ్రీకృష్ణదేవరాయలుకే ఈ పరిస్థితి కల్పించారంటే ఇక ఆ పార్టీలో మిగతా వారి పరిస్థితి ఎలా ఉందో చెప్పకనే చెప్పినట్లు అవుతున్నది.

మైండ్‌గేమ్‌లా మార్పులు

గత కొన్ని రోజులుగా ఒక్కో జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలను తాడేపల్లి ప్యాలెస్‌కు జగన్ కోటరీ పిలిపిస్తూ మీకు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లేదని చెబుతున్నది. అలానే కొంతమందిని నియోజకవర్గాలను మారుస్తూ సమన్వయకర్తలుగా నియమిస్తున్నది. ఇప్పటికే రెండు జాబితాల్లో సమన్వయకర్తల పేర్లను ప్రకటించారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనగా దానిని కప్పిపుచ్చేందుకు మైండ్‌గేమ్‌లా అభ్యర్థులను ఎడాపెడా మారుస్తున్నారు. అలానే మహిళలు, బీసీలను ఉద్ధరిస్తున్నట్లుగా పైకి కలరింగ్ ఇస్తున్నారు. అవినీతికి, వివాదాలకు దూరంగా ఉంటూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న వారిని కూడా నియోజకవర్గం మారమని ఒత్తిడి చేస్తున్నారు.

అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

- 104 కేసులలో 107మంది నిందితులు అరెస్ట్
- రూ.2,65,780 విలువ చేసే మద్యం సీజ్

7లో..

రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయటం తగదు

- 33 వేల ఎకరాలు త్యాగం చేస్తే ప్రతిఫలం అవమానాలా?
- 1480వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు

బయోలమయం

ఊరు పేరు లేని పేర్లతో దిగుమతి

- తెలంగాణ నుంచి గుంటూరుకు రావాణా
- పార్సిల్ కార్యాలయాల్లో టన్నుల కొద్దీ సరుకు
- రైతులు నష్టపోతున్నా పట్టించుకోని అధికారులు



గుంటూరు పార్సిల్ కార్యాలయంలో తెలంగాణ నుంచి వచ్చిన బయో మందులు

గుంటూరు సిటీ, జనవరి 5: గుంటూరును నకిలీ బయో మందులు ముంచెత్తుతున్నాయి. తెలంగాణ నుంచి వస్తున్న బయో ఉత్పత్తులతో నగరంలోని పార్సిల్ కార్యాలయాలు నిండిపోతున్నాయి. ఊరు పేరు లేని బయో మందులు టన్నుల కొద్దీ సరఫరా అవుతున్నాయి. వాటిని ఎవరు ఎక్కడకి పంపుతున్నారో.. ఎందుకు పంపుతున్నారో వంటి వివరాలు లేవు. లేబుళ్లు మార్చి రైతులను ఏమార్చే తంతులో నిఘావర్గాల పాత్రే ప్రశ్నార్థకమవుతుంది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు ప్రతిరోజూ వందల టన్నుల బయో ఉత్పత్తులు వస్తున్నాయి. పార్సిల్ సర్వీసుల ద్వారా వీటిని తీసుకువచ్చి రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ లేబుళ్లు మార్చేసి మార్కెట్‌లోకి డంప్ చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగుతో ఇక్కడ అన్ని రకాల పురుగుల మందులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మిరప, మినుము, శనగ, మొక్కజొన్న, పొగాకు సాగు ఎక్కువగా ఉంది. దిగుబడి ఎక్కువగా సాధించేందుకు రైతులు పోటీలు పడి మరీ పురుగుమందులు వాడుతున్నారు. తెలంగాణలో ఎక్కువగా ఊరు పేరు లేని బయో మందులను తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్ చేసుకునేందుకు గుంటూరు మంచి వ్యాపార కేంద్రంగా మారింది. కొన్ని ప్రముఖ కంపెనీలు పేరుతో నకిలీ మందులను తీసుకొచ్చి లేబుళ్ల మార్చే వ్యాపారం కూడా ఇక్కడ ఎక్కువగా జరుగుతుంది. రైతులకు అంటగడుతున్న బయో మందుల్లో 90 శాతం నకిలీవే అని సమాచారం. వాటినే లైసెన్స్‌డ్ ఫర్టిలైజర్ దుకాణాల్లో అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. నకిలీ బయోలతో రైతులు నష్టపోతున్నారు. నకిలీ బయోల మార్కెటింగ్‌కు వ్యాపారులను ఆధారం చేసుకుంటున్నారు. పెద్దగా కష్టపడకుండా పెద్ద మొత్తంలో లాభం వస్తుండటం తో వారు రైతులను బురిడీ కొట్టించేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీల సమయంలో వీటిని పట్టించుకోవడంలేదు. ఒకవేళ పట్టుకున్నా తూతూమంత్రంగా కేసు నమోదు చేసి సరిపుచ్చుతున్నారే కాని కఠిన చర్యలు తీసుకోవడంలేదు. దీంతో జిల్లాలో నకిలీ బయోల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయల అన్న చందంగా యథేచ్ఛగా సాగుతుంది. బయో మందులు వ్యాపారానికి సుమారు 300 మందికి లైసెన్సులు ఉండగా లైసెన్సు లేకుండా సుమారు 500 మంది వ్యాపారం చేస్తున్నారు. వారిలో చాలామందికి వ్యవసాయశాఖలోని ఉన్నతాధికారులతో చాలా మంచి సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అందువల్లే బయోల వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత శాఖలు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి. గుంటూరు కేంద్రంగా బయో మందులపై నిఘావర్గాలు నిద్ర నటిస్తున్నాయి.


ఊరు పేరు లేని బయోలు

- నియోజకవర్గాల్లో వారిదే ఏలుబడి
- హోదా లేకున్నా అధికారులపై జులుం
- పార్టీ నేతలే అయినా యంత్రాంగం సలాం
- పలు చోట్ల డమ్మీలుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- ఓట్లు వేయించే బాధ్యత మీదేనని బాలసాని ఆదేశాలు

ఇన్‌చార్జిల పెత్తనం



గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సహజంగా ఒక నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యే ఉంటేనే అధికారులను ముప్పతిప్పలు పడతుంటారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ పని చెయ్ ఈ పని చెయ్ అంటూ బెదిరిస్తూ వేధిస్తారు. సీఎం జగన్ చేపట్టిన జిగ్‌జాగ్ ఆటతో ఒక్కో నియోజకవర్గంపై ఇద్దరు పెత్తనం చేసే పరిస్థితి నెలకొన్నది. ఏరికోరి తాము గెలిపించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే ఇప్పటికే నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని సొంత పార్టీ శ్రేణులే కుమిలి పోతుండగా.. తాజాగా పక్క నియోజకవర్గం నుంచి తెచ్చి తమపై బలవంతంగా రుద్దిన నేతల తీరుతో ప్రజలతో పాటు అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఒకే నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేల పెత్తనం కొన్ని చోట్ల, మరికొన్ని చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యే వేరే చోటికి వెళ్లగా వారి బదులుగా నియమితులైన ఇన్‌చార్జిలు అధికార హోదా లేకుండానే ఆయా నియోజకవర్గాల్లోని అధికారులపై పెత్తనం చేయడం ప్రారంభించారు. ప్రత్తిపాడు, చిలకలూరిపేట, వేమూరు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా నియమితులైన వారికి ఇప్పటి వరకు ఎటువంటి హోదాల్లేవు. అప్పుడే వీరు నియోజకవర్గాల్లో అడుగుపెట్టి ఎమ్మెల్యే హోదాలో ఫోజులు కొడుతున్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లోనూ వీరు పాల్గొంటున్నారు. ఇటీవల పింఛన్ల పంపిణీ కూడా వీరే చేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో కూడా వీరిదే హవా. ఓ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏకంగా అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా మండలాల్లోని ఓటర్ల కులగణన జాబితాలు అనధికారికంగా తయారు చేయిస్తుండటం విశేషం. వచ్చే ఎన్నికల్లో వీరు కేవలం పార్టీ అభ్యర్థులు మాత్రమే. అయితే ఆ నియోజకవర్గాల్లోని కొందరు అధికారులు అప్పుడే వీరిని ఎమ్మెల్యేలుగా భావిస్తూ గొడుగులు పట్టడం పలువురిలో విస్మయాన్ని కలిగిస్తుంది. నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యేలను, మంత్రులను, పై అధికారులను కలిసి శుభాకాంక్షలు చెప్పడం సహజం. అయితే వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా తమ నియోజకవర్గాల్లో అడుగుపెట్టిన నేతలకు సైతం పోలీసు అధికారులు బొకేలు అందించడం విమర్శలకు తావిస్తోంది. ఇదే అధికారులు ఎన్నికల వరకు కొనసాగితే నిష్పక్షపాతంగా ఎలా వ్యవహరించగలరనే అనుమానాలు వస్తున్నా యి.

కాగా తాడికొండ నుంచి గెలు పొందిన ఎమ్మెల్యే శ్రీదేవి పదవీ కాలం ఇంకా ముగియక ముందే ఆమెను పక్కకు నెట్టేసి ప్రత్తిపాడు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మేకతోటి సుచరిత తాడికొండలో హల్‌చల్ చేస్తున్నారు. ఆ నియోజకవర్గ అధికారులు కూడా తమ ఎమ్మెల్యే శ్రీదేవి అనే విషయం కూడా మరిచిపోయారు. ఆమె మాటకు విలువే లేకుండా అధికార పార్టీ నేతలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అధికారుల పరిస్థితి మరింత సంకటస్థితిలో ఉన్నది. ఒక వైపు సిట్టింగ్ ఎమ్మెల్యేగా మద్దాళి గిరి ఉండగానే గుంటూరు పశ్చిమలో తాజాగా తిష్ఠ వేసిన మంత్రి విడదల రజిని దూకుడుతో అధికారులు వణికి పోతున్నారు. గుంటూరు పశ్చిమ వైసీపీలో అప్పుడే ఎన్నికల జాతర మొదలైంది. అన్ని విషయాల్లోనూ తమ పార్టీకి అనుకూలమైన రీతిలోనే పనిచేయాలని అధికారులను మంత్రి ఒత్తిడి చేస్తున్నారని సమాచారం.


మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళల చేత తనకే ఓట్లు వేయించాలంటూ వీవోఏలను ఆదేశిస్తున్న వైసీపీ సమన్వయ కర్త బలసాని

ప్రభుత్వ కార్యాలయంలోనే ప్రచారం

ప్రత్తిపాడు: తాజాగా సమన్వయకర్తగా నియమితులైన వైసీపీ నేతలకు అధికారులు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. అధికారికంగా ఏ హోదా లేకున్నా వారికి రాచబాట వేస్తున్నారు. ఒక ప్రజా ప్రతినిధికి ఇచ్చే గౌరవానికి మించి ఇస్తున్నారు. ఎక్కడా లేని చోద్యం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అధికారుల్లో కనిపిస్తుంది. ప్రత్తిపాడు వైసీపీ సమన్వయకర్తను ఇటీవల పోలీసు అధికారులు పార్టీ కార్యాలయంలో కలవడం విమర్శలకు దారి తీసింది. అయినా తాజాగా ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీకి సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఆయనకు బ్రహ్మరథం పట్టడం విమర్శలకు దారితీసింది. మండల సమాఖ్య కార్యాలయానికి ఏపీఎం సురేష్‌కుమార్‌తో వెళ్లిన బలసానికి అక్కడ సన్మానాలే జరిగాయి. ఏపీఎం సురేష్‌తో పాటు సీసీలు ఆయనకు స్వీట్లు తినిపించారు. ప్రత్తిపాడు సెక్రటరి జాన్‌పీరా శాలువా కప్పి సన్మానించారు. ఈ క్రమంలోనే వీవోఏలతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనకు మహిళల చేత ఓట్లు వేయించాలని, అది మీ బాధ్యతే అంటూ బాల సాని వారిని ఆదేశించారు. ప్రత్తిపాడు పంచాయతీ సెక్రటరి జాన్ పీరాపై వైసీపీ నాయకుడు కమ్మో శివప్రసాద్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్తిపాడు వచ్చిన బలసానికి జాన్ పీరా ఫిర్యాదు చేయగా పోలీస్ కేసు పెట్టండి.. నేను చూసుకుంటా అని హామీ ఇవ్వడంతో అక్క డున్న వైసీపీ నాయకులు విస్తు పోయారు.

గ్రామాల్లో పోలీస్ సైరన్‌తో చక్కర్లు

ఎమ్మెల్యే, ఎంపీ,మంత్రులతో పాటు జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల వాహనాలకు గతంలో పోలీస్ సైరన్ ఉండేది. అయితే ఇప్పుడు ప్రత్తిపాడు సమన్వయకర్త బాలసాని కారుకు కుయ్ కుయ్ సైరన్ ఏర్పాటు చేసుకుని మరీ గ్రామాల్లో చక్కర్లు కొడుతుంది. నిబంధనల ప్రకారం ఈ సైరన్ ఉపయోగించడం నేరం. కాని బాలసాని కాన్వాయ్‌లోని కారు సైరన్‌తోనే గ్రామాల్లో చక్కర్లు కొడుతుంది. సైరన్‌తో వాహనం వెళుతుంటే ఏ మంత్రి వస్తున్నాడో అని అందరూ అలర్ట్ అవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకి చెందిన వ్యక్తి కారు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

దిక్సూచి DIKSUCHI

మహా జనపదాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ



క్రీ.పూ.6వ శతాబ్దంలో ఏర్పడిన 16 రాజ్యాలను షోడశ మహా జనపదాలు అంటారు. దీనిని రెండో పట్టణీకరణ అని కూడా అంటారు. మగధ, అంగ, ఛేది, మల్ల, మత్స్య, కురు, గాంధార, అస్మక, కోసల, పాంచాల, కాంభోజ, వజ్జి మొదలైనవి వీటిలో ప్రధాన రాజ్యాలు.

క్రీ.పూ.600 నాటికి షోడశ మహాజనపదాలు 16 రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ప్రస్తుత భారతదేశం అవతల గాంధార, కాంభోజ రాజ్యాలు ఏర్పడ్డాయి. దక్షిణ భారతదేశంలో ఏకైక రాజ్యం అస్మక. ఇది నేటి నిజామాబాద్ జిల్లా. దీని రాజధాని పోతలి(బోధన్). మిగతా రాజ్యాలన్నీ ఉత్తర భారతదేశంలో ఏర్పడ్డాయి. ఈ రాజ్యాల గురించి 'అంగుట్టనికాయ' అనే బౌద్ధ సాహిత్యంలో ఉంది. అవి...

అంగ: బెంగాల్, బిహార్‌లోని భాగల్‌పూర్, మాంఘర్ జిల్లాల ప్రాంతం. దీని రాజధాని చంప.

కాశీ: గంగానది తీరంలో మధ్య ఉత్తరప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని వారణాశి. వరుణ, అసి నదుల మధ్య ఉంది.

కోసల: ఉత్తరప్రదేశ్‌లోని సరయూ నది తీరప్రాంతం. దీని రాజధాని శ్రావస్థి, అయోధ్య

ఛేది: మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం. దీని రాజధాని శక్తిమతి

వత్స: యమునా నదీ తీరంలో ఈ మహాజనపదం ఉంది. దీని రాజధాని కౌశాంబి.

కురు: ఢిల్లీ పరిసర ప్రాంతం. దీని రాజధాని ఇంద్రప్రస్తం. నేటి ఆధునిక ఢిల్లీ. మలివేద కాలంలో భరత, పురు తెగలు కలిసి 'కురు' తెగగా ఏర్పడింది.

పాంచాల: ఉత్తర ప్రదేశ్‌లోని బదౌని, ఫరుకాబాద్ జిల్లాల్లో పాంచాల జనపదం ఉంది. దీని రాజధాని అహిచ్ఛత్ర.

అవంతి: పశ్చిమ మధ్యప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని ఉజ్జయిని.

అస్మక: దక్షిణాపథ రాజ్యం. రాజధాని నిజామాబాద్ జిల్లాలోని బోధన్

మగధ: బిహార్‌లోని పట్నా, గయ జిల్లాల మధ్య ప్రాంతం. రాజధాని గిరివ్రజం, రాజగృహం, పాటలీపుత్రం.

శూరసేన: మధుర కేంద్రంగా యమునా నది తీర ప్రాంతం. రాజధాని మధుర

మత్స్య: రాజస్థాన్‌లోని జైపూర్ ప్రాంతం. దీని రాజధాని విరాట నగరం.

గాంధార: నేటి ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రాంతం. దీని రాజధాని తక్షశిల నేటి రావల్పిండి.

కాంభోజ: నేటి ఆఫ్ఘనిస్థాన్

మల్ల: కుశినగర్, పావాపురి ప్రాంతాల్లో ఏర్పడిన జనపదం. రాజధాని పావపురి.

వజ్జి: ఉత్తర బిహార్ ప్రాంతం. దీని రాజధాని వైశాలి ప్రాంతం.

ముఖ్యమైన జనపదాలు:

1. మగధ, 2. అవంతి, 3. కోసల, 4. వారణాశి

పై రాజ్యాల్లో మగధ రాజ్య విస్తరణకు దోహదపడిన రాజవంశాలు వరుసగా...హర్యంక, శిశునాగ, నంద, మౌర్య.

హర్యంక వంశం

బింబిసారుడు ఈ వంశ స్థాపకుడు. భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా సిద్ధ సైన్యం ఏర్పాటు చేశాడు. అంగరాజైన బ్రహ్మదత్తున్ని ఓడించి వారి రాజధాని 'చంప'ను ఆక్రమించాడు. బింబిసారుడు కోసల రాకుమార్తెను వివాహం చేసుకొని 'కాశీ' మహాజనపదాన్ని కట్నంగా పొందాడు. అవంతి రాజైన చంద్రప్రద్యోత మహాసేనతో యుద్ధాలు చేసి చివరికి సంధి కుదుర్చుకున్నాడు. బింబిసారుని ఆస్థానంలో 'జనకుణ్ణి' లేదా జీవకుడు అనే వైద్యుడు ఉండేవాడు.

ఆజాత శత్రు: తన తండ్రి బింబిసారుడిని సంహరించి రాజు అయ్యాడు. పాటలీపుత్రం పేరుతో నూతన నగరాన్ని నిర్మించాడు. ఇది ప్రస్తుత బిహార్ రాష్ట్ర రాజధాని పట్నా. కోసల రాజు ప్రసేన జిత్తు కుమార్తె వజ్జీరను వివాహం చేసుకున్నాడు. మహాశిల, రథముశాల అనే నూతన ఆయుధాలు తయారు చేశాడు.

ఉదయనుడు: పాటలీపుత్రను తన రాజధానిగా చేసుకున్నాడు. గంగ, శోణ, సరయూ, గండకి నదుల సంగమ స్థానంలో పాటలీపుత్రం ఉంది. కాబట్టి పాటలీపుత్రం నగరాన్ని గొప్ప జలదుర్గం అని అంటారు. ఉదయనుడు తర వాత అనిరుద్ధ, మండరాజు, నాగదాసకుడు వరుసగా పరిపాలించారు.

శిశునాగ వంశం

శిశునాగుడు: నాగ దాసకున్ని సంహరించి శిశునాగుడు ఈ వంశాన్ని స్థాపించాడు. వీరి రాజధాని వైశాలి.

కాల అశోకుడు: ఈ వంశంలో మరొక రాజు కాల అశోకుడు. ఇతడు బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఈ వంశంలో చివరి వాడు కాకవర్ధిన్

నంద వంశం

శిశునాగ వంశాన్ని ఓడించి, నందవంశాన్ని మహాపద్మనందుడు స్థాపించాడు. ఇతనికి 'రెండో పరశురాముడు', 'ఏకరాట్' అనే బిరుదులు ఉన్నాయి. మహాపద్మనందుడు శూద్ర స్త్రీకి జన్మించినట్లు పురాణాల్లో ఆధారాలున్నాయి. మహాపద్మనందుడు కళింగ(ఒడిశా)పై దండెత్తి కొన్ని జైన విగ్రహాలను పాటలీపుత్రానికి తరలించాడు.

ధననందుడు: ఈ వంశంలో చివరి రాజు ధననందుడు. నంద రాజులను నవనందులు అని కూడా అంటారు. ఈ నంద రాజులను గ్రీకులు 'ఉగ్రసేనులు'గా వర్ణించారు. ధననందుని కాలంలో వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తాడు. ధననందుడిని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు

పర్షియన్లు: భారతదేశంపై తొలిసారిగా దండయాత్ర చేసిన విదేశీయులు పర్షియన్లు. పర్షియన్స్ అంటే ఇరానీయులు. వీరినే పారశీకులు అని కూడా పిలుస్తారు.

డేరియస్: పర్షియన్లను పాలించిన మొదటి డేరియస్ క్రీ.పూ.516లో పంజాబ్, సింధూ ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకొన్నాడు. ఆ కాలంలో రాష్ట్రాలను 'సంతృపి' లేదా 'సాత్రపి' అని పిలిచేవారు. ఈ రాజు కాలంలోనే పర్షియా రాజ్యంలో పంజాబ్, సింధూ ప్రాంతాలను 20వ సాత్రపిగా చేర్చారు.

గ్రీకులు: భారతదేశంపై దండయాత్రను చేసిన రెండో వారు గ్రీకులు. క్రీ.పూ. 356లో అలెగ్జాండర్ జన్మించాడు. ఇతని గురువు అరిస్టాటిల్. గ్రీకులకు, పర్షియన్లకు మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. వీటి గురించిన పూర్తి సమాచారం 'హిస్టోరికా' గ్రంథంలో ఉంది.

- క్రీ.పూ.336లో తన తండ్రి మరణానంతరం అలెగ్జాండర్ సింహాసనం అధిష్టించాడు. అనేక గ్రీకు రాజ్యాలను జయించి ఏకీకృతం చేశాడు. తరవాత 'ఆసియా మైనర్' ప్రాంతాలపై దండెత్తాడు. ఈజిప్టును ఆక్రమించి నైలు నది ఒడ్డున అలెగ్జాండ్రియా అనే నగరాన్ని అలెగ్జాండర్ నిర్మించాడు. గౌగమేళ యుద్ధంలో పర్షియా రాజైన మూడో డేరియస్‌ను ఓడించాడు. వారి రాజ్యాన్ని కూడా ఆక్రమించాడు. వారి రాజధాని పెర్సిపోలిస్‌ను ధ్వంసం చేశాడు. అలెగ్జాండర్‌కు వ్యతిరేకంగా గౌగమేళ యుద్ధంలో పర్షియన్లతో కలిసి భారతీయులు కొంతమంది యుద్ధం చేశారు. దాంతో అలెగ్జాండర్ కాబుల్ ప్రాంతాలను ఓడించి ఖైబర్ కనుమల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించాడు.
- అలెగ్జాండర్ తక్షశిల రాజైన 'అంబి'తో సైనిక ఒప్పందం చేసుకున్నాడు. అతనిని తన సామంతుడిగా మార్చుకున్నాడు. క్రీ.పూ.326వ సంవత్సరంలో అలెగ్జాండర్‌కు పురుషోత్తమ్(పోరస్)కు మధ్య హైడాస్పస్(జీలం నది) ఒడ్డున కర్రమైదాన ప్రాంతంలో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అలెగ్జాండర్ విజయం సాధించాడు. అంబి చక్రవర్తి అలెగ్జాండర్‌ను ఆహ్వానించి సహాయం చేశాడు. ఈ సందర్భంగా భారతీయుల పోరాటపటిమను అలెగ్జాండర్ ప్రశంసించాడు. పురుషోత్తమ్‌ను సత్కరించి, అతని రాజ్యాన్ని అతనికి ఇచ్చి ఒక రాజుగా గుర్తించాడు.
- భారతదేశ వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ తాను జయించిన ప్రాంతాలను, కాబుల్‌లోని ప్రాంతాలను కలిపి తన సైన్యాధ్యక్షుడైన సెల్యూకస్ నికేటర్‌ను గవర్నర్‌గా నియమించాడు.
- ఈ క్రమంలో తన సైనిక తిరుబాటు కారణంగా అలెగ్జాండర్ పాటలీపుత్రంపై దాడి చేయకుండానే మాతృదేశానికి పయనమయ్యాడు. మార్గమధ్యలో క్రీ.పూ.323లో ఇరాక్‌లోని బాబిలోనియా ప్రాంతంలో విష జ్వరంతో అలెగ్జాండర్ మరణించినట్లు గ్రీకు చరిత్రకారులు పేర్కొన్నారు. అయితే మరికొన్ని మత గ్రంథాల్లో మాత్రం.. పురుషోత్తమ్‌తో జరిగిన యుద్ధంలో గాయపడి, దాని ప్రభావం చేతనే అలెగ్జాండర్ మరణించినట్లు రాసి ఉంది.
- గ్రీకుల దండయాత్రతో భారతదేశంలో చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.



డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట

గుజరాత్ మారిటైమ్ వర్సిటీలో ఎంబీఏ, ఎల్ఎల్ఎం

గాంధీనగర్‌లోని గుజరాత్ మారిటైమ్ యూనివర్సిటీ (జీఎంయూ)- ఎంబీఏ, మాస్టర్ ఇన్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి.

ఎంబీఏ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్

దీనిని సంస్థ ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మారిటైమ్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తుంది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 106 క్రెడిట్స్ నిర్దేశించారు. ఈ ప్రోగ్రామ్‌ని డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ బిజినెస్ స్కూల్ రూపొందించింది. ఆలిండియా కోటా కింద 30 సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: జాతీయ స్థాయిలో సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ రిమోట్‌లీ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వెర్బల్ ఎబిలిటీ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు 70 శాతం, ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఉంటుంది. సీమ్యాట్/క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎల్ఎల్ఎం

సంస్థ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ లీగల్ స్టడీస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మారిటైమ్ లా, ఇంటర్నేషనల్ ట్రేడ్ లా స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో మూడు కంపల్సరీ కోర్సులు, రెండు స్పెషలైజేషన్ కోర్సులు; రెండో సెమిస్టర్‌లో నాలుగు స్పెషలైజేషన్ కోర్సులు, ఒక డిజర్టేషన్ ఉంటాయి. సెమిస్టర్‌కు 13 చొప్పున మొత్తం 26 క్రెడిట్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయశ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు, క్లాట్ అర్హత పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో క్లాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు అవకాశం ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **వెబ్‌సైట్:** gmu.edu.in

ఐఐటీ మద్రాస్‌లో డేటాసైన్స్ అండ్ అప్లికేషన్స్



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ (2024 జనవరి బ్యాచ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్ట్‌లుగా రాణించవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.
- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవల్‌కు అర్హత సాధిస్తారు. దీన్ని పూర్తిచేసిన తరవాత డిప్లొమాకు ఆ తరవాత బీఎస్సీ డిగ్రీకి, తరవాత బీఎస్‌కి అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023కి అర్హత పొందినవారు కూడా అడ్మిషన్ పొందవచ్చు. వీరు క్వాలిఫయర్ ఎగ్జామ్‌నకు బదులు నాలుగు గంటల క్విజ్‌లో అర్హత పొందాల్సి ఉంటుంది. క్విజ్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవెల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు 12 వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **క్వాలిఫయర్ ఫేజ్ ప్రారంభం:** జనవరి 19 నుంచి
- **క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** ఫిబ్రవరి 25
- **ఫలితాలు విడుదల:** మార్చి 1
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** మార్చి 6 నుంచి 7 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VYzIaSPలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

స్నేహానికి అద్దంపట్టేలా



నాగార్జున సంక్రాంతి కోడిపుంజు 'నా సామిరంగ'పై రోజురోజుకీ అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. చాలాకాలం తర్వాత నాగ్ పూర్తిస్థాయి మాస్ పాత్ర చేయడంతో అభిమానులు సినిమాకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దర్శకుడు విజయ్ బిన్నీ వినూత్నమైన కాన్సెప్ట్‌తో సినిమాను తెరకెక్కించినట్లు చిత్రబృందం చెబుతోంది. ఇప్పటివరకూ విడుదలైన పాటలు యువతరాన్ని బాగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం 'దేవుడే తన చేతిలో..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఎం.ఎం.కీరవాణి రాసి స్వరపరిచిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. నాగార్జున, అల్లరి నరేశ్ పాత్రల స్నేహాన్ని అద్దంపట్టేలా ఈ పాటను చిత్రీకరించడం జరిగిందని, స్నేహం గొప్పతనం తెలిసేలా కీరవాణి సాహిత్యం సాగిందని వారు అన్నారు. అశికా రంగనాథ్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో రాజ్‌తరుణ్, మిర్నామీనన్, రుక్సార్ ధిల్లాన్ ఇతర తారాగణం కాగా, ఈ చిత్రానికి రచన: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: శివేంద్ర దాశరథి.


బ్రహ్మారాక్షసుడు వచ్చాడ్రా



గోపీచంద్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. కన్నడ దర్శకుడు ఎ హర్ష తెరకెక్కిస్తున్నారు. కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసి ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'రాక్షసుల్ని వేటాడే బ్రహ్మారాక్షసుడు వచ్చాడ్రా' అనే బ్యాగ్రౌండ్ వాయిస్‌తో మొదలైన టీజర్ గోపీచంద్ పాత్ర ఎలా ఉండబోతోందో చెప్పింది. పరిచయ సన్నివేశంలో గోపీచంద్ ఖాకీ యూనిఫాంలో ఎద్దుపై కూర్చొని మాస్ ఎంట్రీ ఇచ్చిన తీరుతో ఆయన పాత్ర ఎంత శక్తిమంతంగా ఉండబోతోందో తెలుస్తోంది. రవి బస్రూర్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. సినిమాటోగ్రఫీ: స్వామి గౌడ

రామ్‌చరణ్ సినిమాలో శివన్న?





బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందనున్న 'రామ్‌చరణ్ 16' పై వస్తున్న అప్‌డేట్‌లు మెగా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. కోస్తా నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాకు సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ తీసుకున్నారు. సీనియర్ హీరోయిన్ లయ ఈ సినిమాతో రీఎంట్రీ ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇక ఇందులో చరణ్‌కు జోడీగా ముందు జాన్వీకపూర్ పేరు వినపడింది. తర్వాత ఆ స్థానంలో సాయిపల్లవి వచ్చి చేరింది. కథానాయికగా ఆమె దాదాపు ఖరారైనట్టు తెలిసింది. ఇప్పుడు మరో విశేషమేంటంటే.. ఈ సినిమాలో కన్నడ అగ్ర నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే చెన్నయ్‌లోని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 'ఆర్‌సీ16'లో తను నటించనున్నట్టు, ప్రస్తుతం ఆ విషయం చర్చల దశలో ఉన్నట్టు ఆయన తెలిపారు. శివరాజ్‌కుమార్ ఇటీవలే రజనీకాంత్ 'జైలర్'లో ప్రత్యేకపాత్రలో మెరిశారు. నిడివి తక్కువే అయినా.. ఆ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలిచింది. మళ్లీ 'ఆర్‌సీ 16'లో కనిపించనున్నారు. ఇది మెగా అభిమానులకు నిజంగా శుభవార్తే.

వెంకటేశ్‌తో సినిమా కోరిక తీరింది

వెంకట్ బోయనపల్లి



అందరూ 'సైంధవ్' చిత్రంలో పోరాట ఘట్టాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు కానీ మనసుకు హత్తుకునే కుటుంబ అనుబంధాల గురించి దర్శకుడు హృద్యంగా తెరకెక్కించారు. థియేటర్ నుంచి బయటికొచ్చేటప్పుడు ప్రేక్షకుల కళ్లు చెమ్మగిల్లుతాయి' అని నిర్మాత వెంకట్ బోయనపల్లి అన్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- వెంకటేశ్ గారు నా అభిమాన హీరో. ఆయనతో నిర్మాతగా ఓ సినిమా చేయాలనేది నా కోరిక. దర్శకుడు శైలేష్ కొలను చెప్పిన కథ నచ్చడంతో ఆయన వెంటనే 'సైంధవ్' చిత్రం చేసేందుకు అంగీకరించారు. ఒక్క రోజులోనే ప్రాజెక్ట్ ఓకే అవ్వడం ఆశ్చర్యం కలిగించింది. వెంకటేశ్ గారి 75వ చిత్రం చేసే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను.
- ఈ సినిమాకు వెంకటేశ్‌గారిని ఒప్పించిన ఘనత శైలేష్‌కే దక్కుతుంది. మా ప్రయత్నం మేం చేశాం. ఇలాంటి కాంబినేషన్ కుదరడం విధిరాత అని వెంకటేశ్ అన్నారు. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, ఆండ్రియా లాంటి అగ్ర తారలు భాగమవడం, భారీ స్థాయిలో నిర్మించడం వల్ల ఖర్చు ఎక్కువే అవుతుందని తెలుసు. అందుకు ముందుగానే సిద్ధమయ్యాం. సంతోష్ నారాయణ్ సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. అన్నీ కుదిరితే నాని, వెంకటేశ్ గారితో మల్టీస్టారర్ చేయాలనుంది.

మూడు తరాలు ఒకే ఫ్రేమ్‌లో



మోహన్‌బాబు మనవడు, విష్ణు తనయుడు అవ్రామ్ బాలనటుడిగా వెండితెరకు పరిచయమవబోతున్నాడు. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంతో అవ్రామ్ తెరంగేట్రం చేయనున్నాడు. ఇందులో మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అంటే మోహన్‌బాబు విష్ణు, అవ్రామ్ ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల నటులు ఒకే ఫ్రేమ్‌లో అలరించనున్నారన్నమాట. శుక్రవారం విష్ణు ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నా కొడుకు అవ్రామ్ 'కన్నప్ప' చిత్రంలో కీలకపాత్రలో నటిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది మా కుటుంబంలోని మూడు తరాల కలయికలో వస్తున్న అరుదైన చిత్రం. మా కుటుంబంలో నూతన అధ్యాయానికి 'కన్నప్ప' నాంది పలుకుతుంది' అని చెప్పారు. ఈ చిత్రంలో ప్రభాస్ శివుడి పాత్రలో కనిపించనున్నారు. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం ప్రధాన తారాగణం.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2U8inXv లో చదవండి.

శ్రీవారి సేవలో నటి జాన్వీ కపూర్



నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరి, స్నేహితులతో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల (ఆంధ్రజ్యోతి)

భుజం తట్టి ప్రోత్సహించారు





ఇటీవలే దివంగతులైన తమిళ హీరో విజయ్‌కాంత్‌ను తలచుకొని సూర్య కన్నీరు పెట్టుకున్నారు. విజయ్‌కాంత్ కన్నుమూసిన సమయంలో సూర్య విదేశాల్లో షూటింగ్‌లో ఉన్నారు. దాంతో చివరి చూపు దక్కలేదు. తిరిగొచ్చాక ఆయన గురువారం చెన్నైలోని విజయ్‌కాంత్ సమాధి వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంలో విజయ్‌కాంత్‌ను గుర్తుచేసుకొని సూర్య తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కెరీర్ ఆరంభంలో అపజయాలు రావడంతో నిరాశలో ఉన్న నన్ను విజయ్‌కాంత్ ఎంతగానో ప్రోత్సహించారు అని చెప్పారు. 'పెరియణ్ణా' సినిమాలో ఆయనతో కలిసి నటించాను, ఆ సమయంలో ఆయన నన్ను ఆదరించిన తీరు ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.



వెంకటపాలెం రైతు ధర్నాశిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయటం తగదు

● 33 వేల ఎకరాలు త్యాగం చేస్తే ప్రతిఫలం అవమానాలా?

● 1480వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 5: రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయటం తగదని 33 వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్, హైకోర్టు తీర్పును అమలుచేయాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1480వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన తమకు వైసీపీ ప్రభుత్వం అవమానాలు బహూకరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానులు అంటూ ప్రతి రోజు మానసికంగా కుంగదీస్తున్నారన్నారు. అవమానాలు భరించలేక 200మందికి పైగా రైతులు ప్రాణాలు విడిచారన్నారు. ప్రజా రాజధాని ఏర్పాటుచేస్తున్నామని ప్రభుత్వం అడిగితేనే భూములు ఇచ్చామన్నారు. చట్ట ప్రకారం ఒప్పందం కుదుర్చుకొని ల్యాండు పూలింగ్ స్కీం కింద ఇచ్చామన్నారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేయటమే ధ్యేయంగా పెట్టుకుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.9వేల కోట్ల అమరావతి అభివృద్ధి పనులు జరిగితే, నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గురజాలటౌన్, జనవరి 5: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని మాడుగులలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కంపసాటి వెంకటనరసయ్య (36) తన పొలంలో బోరు మరమ్మతులకు గురవడంతో గ్రామంలోని ప్రైవేట్ హెల్పర్ నలజాల శ్రీనుతో కలిసి పొలానికి చేరుకున్నారు. మరమ్మతులు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతూ వెంకటనరసయ్య హైడ్రాలిక్ పైపును కిందికి దింపే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటనరసయ్యను కాపాడేందుకు శ్రీను ప్రయత్నించగా అతనికి కూడా గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, జనవరి 5: తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలకలూరు రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెనాలి రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు కొలకలూరు స్టేషన్ సమీపంలో సుమారు 50-55 సంవత్సరాల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య

తెనాలి మారీసుపేట, జనవరి 5: ఉరివేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన సుల్తానాబాదులో జరిగిందని త్రీటౌన్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం పట్టణంలోని సుల్తానాబాదుకు చెందిన కుంచాల హనుమంతరావు కుమార్తె కుంచాల స్వాతి(24) ఏం ఫార్మసీ చదువు పూర్తి చేసింది. తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలు చేస్తుండగా వివాహం చేసుకోవడం ఇష్టంలేక ఫ్యానుకు ఉరి వేసుకుని మృతిచెందిందని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

ఉద్యమాల పేరుతో ప్రజలను మోసం చేసిన ఆర్.కృష్ణయ్య

● టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు రాజ్యాధికారం ● ఎమ్మెల్యే అనగాని



రేపల్లె, జనవరి 5: ఉద్యమాల పేరుతో ఆర్.కృష్ణయ్య ప్రజలను మోసం చేసి వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగం సంపాదించుకున్నారే తప్ప బీసీ సోదరులకు ఒక్కరికైనా ఉద్యోగం ఇప్పించారా అని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 52 కార్పొరేషన్లు పెట్టారే తప్ప ఒక కార్యాలయం గాని, చైర్మన్‌లకు కుర్చీలు గాని ఏర్పాటుచేసిన పరిస్థితి లేదన్నారు. దొంగ కార్పొరేషన్ల పేరిట రూ.కోట్లల్లో రుణాల రూపేణా దోచుకుతిన్నది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు రాజ్యాధికారం కల్పించారన్నారు. బీసీలకు 34శాతం ఉన్న రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 శాతం చేసి 16వేల పోస్టులను లాగేసుకున్న వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 150 పథకాలు తెచ్చి బీసీలకు సముచిత స్థానం కల్పించామన్నారు. ఆర్.కృష్ణయ్య చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు బీసీలకు మాయమాటలు చెప్పిన జగన్‌కు రానున్న రోజుల్లో బీసీలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో అన్ని శాఖల ఉద్యోగులు రోడ్డెక్కిన పరిస్థితి చూస్తున్నామన్నారు. ఉపాధ్యాయులతో బాత్‌రూమ్‌లు కడిగించటం, అంగన్‌వాడీలు 25రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవటం, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు న్యాయమైన కోర్కెల సాధన కోసం నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం సిగ్గు చేటన్నారు. అబద్ధపు హామీలతో జగన్ ఒక్క చాన్స్ అని రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని, అభివృద్ధిలో 25 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కనుమూరి బాజీచౌదరిపై కక్షతోనే కేసు

సత్తెనపల్లి, జనవరి 5: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరిపై సత్తెనపల్లి డీఎస్పీ కక్ష సాధింపుతోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకరికల్లు మండలం కుంకలగుంటలో ఇటీవల అర్ధరాత్రి సమయంలో నలుగురు యువకులు సంచరిస్తుండగా గతంలో ఆ ప్రాంతంలో దొంగతనాలు జరిగి ఉండటంతో బాజీచౌదరి సమాచారాన్ని పోలీసులకు అందించి వారిని పట్టించారన్నారు. రాజకీయ ఒత్తిడుల నేపథ్యంలో బాజీచౌదరి కులం పేరుతో వారిని దూషించాడని తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. బాజీచౌదరికి 41 నోటీసులు ఇవ్వకుండా 2వ తేదీ అర్ధరాత్రి కుంకలగుంటలో బాజీచౌదరి ఇంటిపై డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు దాడిచేసి భయానక వాతావరణం సృష్టించారన్నారు. వెంటనే అతనిపై నమోదుచేసిన తప్పుడు కేసును ఉపసహరించుకోవాలని కన్నా డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దోపిడీ, అరాచకపాలనకు తెరతీశారని కన్నా అన్నారు. రాష్ట్రాన్ని గాలికి వదిలి వేశారన్నారు. దొంగల ముఠాలా సీఎం జగన్, అతని ఎమ్మెల్యేలు రాష్ట్రం మీదపడి దోచుకుతింటున్నారన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, తిరుగుబాటును తట్టుకోలేక తన వైఫల్యాలను ఎమ్మెల్యేలపై నెట్టారన్నారు. రాష్ట్రంలో 75శాతం ప్రజావ్యతిరేకత ముఖ్యమంత్రిపై, 25శాతం ఎమ్మెల్యేల మీద ఉందన్నారు. ప్రజలు తిరస్కరించిన ఎమ్మెల్యేలు, మంత్రులను వేరే ప్రాంతాల్లో నియమిస్తే ప్రజలు అమాయకులు కారని తిప్పికొడతారన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా నిరుద్యోగ యువతతో జగన్ ఆటలాడుతున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెపుతారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, నాగోతు శౌరయ్య తదితరులు

రోగులకు సక్రమంగా వైద్యసేవలందించాలి

రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల

కొల్లిపర, జనవరి 5: రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల అన్నారు. శుక్రవారం మండలంలోని హనుమాన్‌పాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష పేజ్-2 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. క్యాంపులో వివిధ వైద్యాధికారులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మందులను పరిశీలించి అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు రోగులందరికి తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.ప్రభుత్వం పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వైద్యాధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.శ్రావణ్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, మెడికల్ జిల్లా కో-ఆర్డినేటర్ శిరీష, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వైద్యాధికారి లక్ష్మిసుధ, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో మందులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల



నంబూరులో రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతున్న మైనార్టీలు

సర్వే చేయకుండా రోడ్డు ఎలా వేస్తారు?

● వైసీపీ నాయకుడి తీరుతో స్థానికుల నిరసన ● అడ్డుకున్న స్థానికులపై వైసీపీ నాయకుడి ఆగ్రహం ● బౌన్సర్లను తెచ్చి బెదిరించిన వైనం

పెదకాకాని, జనవరి 5: మా రోడ్డులో అన్నీ ఆక్రమణలు ఉన్నాయి... రోడ్డు సర్వే చేసి మార్కింగ్ వేసిన తర్వాతనే రోడ్డు పనులు ప్రారంభించాలని నంబూరుకు చెందిన మైనార్టీలు కోరారు. శుక్రవారం ఆ ప్రాంతంలో రోడ్డు వేసేందుకు వచ్చినవారిని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన స్థానిక వైసీపీ మైనార్టీ నాయకుడు, ఎమ్మెల్యే రోశయ్య ప్రధాన అనుచరుడూ అయిన సదరు నేత తమ బలం చూపించేందుకు వెంటనే బౌన్సర్లను తెప్పించి స్థానికులపై దౌర్జన్యానికి దిగారు. దీన్ని తీవ్రంగా ప్రతిఘటించిన స్థానికులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో రోడ్డు వేయడం తాత్కాలికంగా నిలిపివేశారు.

రేపు ఉపకార వేతనాల పంపిణీ

● 300 మందికి రూ.50లక్షలు పంపిణీ ● కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బసవపున్నయ్య

గుంటూరు(విద్య), జనవరి 5: ప్రభుత్వ సహాయం పొందని ప్రతిభావంతులైన పేద సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు ఈనెల 7వ తేదీన కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య వెల్లడించారు. కేఎల్పీ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. 2003లో సంస్థ ఏర్పాటుచేసి అప్పటినుంచి ప్రతి సంవత్సరం ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈనెల 7న కేఎల్పీ స్కూల్‌లో జరిగే కార్యక్రమంలో 300 మందికి రూ.50లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విశ్రాంత ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. సంస్థ నుంచి ఆర్థిక సహాయం అందుకుని జీవితంలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు చేయూత ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు, వడ్లమూడి గోవర్ధనరావు, కేఎల్పీ స్కూల్ డీన్ నామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

వైసీపీ ఓట్ల దొంగలపై అప్రమత్తంగా ఉండాలి

● టీడీపీ, జనసేన శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 5: టీడీపీ, జనసేన కార్యకర్తలంతా వైసీపీ ఓట్ల దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రాష్ట్రంలో వైసీపీకి ఓటమి ఖాయమైన పరిస్థితుల్లో విపక్షాల ఓట్లు జాబితాలో గోల్‌మాల్ చేసేందుకు జగన్‌రెడ్డి ముఠా తెగించే అవకాశం ఉందని ఆయన అన్నారు. పట్టణంలోని 10, 11 వార్డుల పార్టీ నాయకులతో శుక్రవారం జరిగిన సమీక్షలో ప్రత్తిపాటి మాట్లాడారు. సొంత పార్టీ నేతలే బైబై జగన్ అంటూ పారిపోతున్న పరిస్థితుల్లో బ్లూ బ్యాచ్ విపక్షాల ఓట్లు తొలగించటం, దొంగ ఓట్లు చేర్పించటం, పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఈనెల 22న తుది ఓటర్ల జాబితా విడుదలకు ఈసీ సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటు జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాల గురించి, టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. అనేక మంది వైసీపీ నాయకులు టీడీపీలోకి రావటం శుభ పరిణామంగా ప్రత్తిపాటి అభివర్ణించారు.

నిరుద్యోగులను మోసం చేసిన ముఖ్యమంత్రి

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

బెల్లంకొండ, జనవరి 5: అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తానని.. జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికి నిరుద్యోగులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలువునా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ లేక, రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రంలోని నిరుద్యోగుల్లో 73 శాతం పట్టభద్రులు ఉన్నారని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల వైసీపీ పాలనలో యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంలో 15 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడితే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు డీఎస్సీ నిర్వహించి 18వేల ఉద్యోగాలు ఇచ్చామని సూచించారు. ప్రతి ఏటా మెగా డీఎస్సీ అన్న జగన్ ఒక్క టీచర్ ఉద్యోగం భర్తీ చేయలేదని వివరించారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తామన్న సీఎం ఎంతమందికి ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో గంజాయి అక్రమ రవాణాలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, టీడీపీ నేతలు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, సలాం, గుంజా గంగారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్వారీలో విజిలెన్స్ అధికారుల విచారణ

చేబ్రోలు, జనవరి 5: చేబ్రోలు క్వారీలో, జగన్న కాలనీలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. చేబ్రోలులో ఓ వైసీపీ నాయకుడు జగన్న కాలనీకి మెరక వేస్తున్నానని గ్రావెల్ క్వారీని తవ్వారు. 25 అడుగులపైగా మైనింగ్ చేసి గ్రావెల్‌ను వివిధ ప్రాంతాలో పెద్దఎత్తున విక్రయించిన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఓ వైసీపీ నాయకుడే విజిలెన్స్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఫిర్యాదు ఆధారంగా శుక్రవారం చేబ్రోలు వచ్చిన విజిలెన్స్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, మైనింగ్ అధికారులు గ్రావెల్ క్వారీ వద్దకు వెళ్లి మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే చేబ్రోలు జగనన్న కాలనీకి వెళ్లి సదరు మట్టిని తోలిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు గృహాల లబ్ధిదారులు తమకు ఆ మైనింగ్ చేసిన నాయకుడు గ్రావెల్ తోలలేదని అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. అయితే విజిలెన్స్ అధికారుల విచారణను గోప్యంగా ఉంచటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

13న తెలుగు రాష్ట్రాల స్థాయి పాటల పోటీలు

మాచర్ల, జనవరి 5: లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా గాయనీ గాయకులను ప్రోత్సహించేందుకు 'మనము పాడుదాం' అనే సినిమా పాటల పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీన పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో పోటీలు జరగనున్నాయి. ఆసక్తిగల వారు 13వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ప్రాక్టీస్‌కి హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజు సాయంత్రం 6 గంటలకు తుది పోటీ జరపుతామన్నారు. వయోభేదం, ఎంట్రీ ఫీజు లేదని, భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. లయన్స్ జిల్లా సాంస్కృతిక శాఖాధ్యక్షుడు డాక్టర్ కమలాసనరావు ఆధ్వర్యాన జరిగే ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. సమాచారం కోసం సెల్: 94410 65681ను సంప్రదించాలని కోరారు.

అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

● 104 కేసులలో 107మంది నిందితుల అరెస్ట్

● రూ.2,65,780 విలువ చేసే మద్యం సీజ్

బాపట్ల, జనవరి 5: జిల్లాలోని అక్రమ మద్యం, నాటుసారా తయారీ కేంద్రాలపై ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం విస్తృత దాడులు చేశారు. జిల్లా వ్యాప్తంగా గత 10 రోజులుగా 104 కేసులలో 107మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.2,65,780 విలువైన మద్యం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యం, నాటుసారా క్రయ, విక్రయాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యానికి సంబంధించి మొత్తం 80 కేసులలో 83మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.1,86,478 విలువైన మద్యాన్ని సీజ్ చేశామన్నారు. సెబ్ అధికారులు 24 కేసులలో 25మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.79,302 విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, నిల్వ చేసిన స్థావరాలపై మెరుపుదాడులు నిర్వహించి మొత్తం 26 కేసులలో 38.25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 5,640 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ రోడ్డులో నాటుసారా కలిగివున్న మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద ఉన్న 3 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నారని అమర్తలూరు పోలీసుస్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద 11 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారని అన్నారు. యద్దనపూడి పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద 8 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. తరుచుగా పోలీసు అధికారులు, సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహిస్తూ అనుమానిత ప్రాంతాలలో సోదాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఎస్పీ హెల్ప్‌లైన్ 83338 13228 నెంబరుకు లేదా డయల్ 100, 112కు కాల్ చేసి సమాచార అందజేస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

స్టూవర్టుపురంలో...

బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలో సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసు సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. కుందేరువాగు పక్కనే పోరంబోకులో నాటుసారా తయారీ చేస్తున్నట్లు గుర్తించి డ్రమ్‌లను వెలికితీసి 700 లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేశారు. అదేవిధంగా మండలంలోని బసివిరెడ్డిపాలెంలో అక్రమ మద్యం విక్రయ కేంద్రంపై దాడి చేసి 16 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దాడి నిర్వహించిన వారిలో ఎస్సై ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసు, పోలీసులు, ధ్వంసం చేసిన బెల్లం ఊట డ్రమ్‌లు

సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు



గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవుల రద్దీకి అనుగుణంగా రైల్వేశాఖ మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు పేర్కొన్నది. నెం.07025 సికింద్రాబాద్ - బరంపురం రైలు ఈ నెల 12, 19 తేదీల్లో రాత్రి 7.45కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 11.15కి బరంపురం చేరుకొంటుంది. నెం.07026 బరంపురం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 13, 20 తేదీల్లో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 6.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెం.07253 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలు ఈ నెల 16న సాయంత్రం 5.10కి బయలుదేరి రాత్రి 10.40కి గుంటూరుకు వచ్చి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు వేకువజామున 5.20కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెం.07254 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 17న సాయంత్రం 6.05కి బయలుదేరి రాత్రి 10.45కి గుంటూరు, మరుసటి రోజు వేకువజామున 5.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నెం.07023 హైదరాబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 12న సాయంత్రం 6.30కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 7.10కి కాకినాడటౌన్‌కు చేరుకొంటుంది. నెం.07024 కాకినాడ టౌన్ - హైదరాబాద్ రైలు ఈ నెల 13న రాత్రి 10 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి హైదరాబాద్ చేరుకొంటుంది. అలానే ఈ నెల 10న నెం.07066 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్, 11న కాకినాడటౌన్ - సికింద్రాబాద్, 12న నెం.07250 సికింద్రాబాద్ - కాకినాడటౌన్ రైళ్లు కూడా గుంటూరు, సత్తెనపల్లి మీదగా ప్రయాణిస్తాయని డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం వాయిదా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బిజీగా ఉండటంతో శనివారం గుంటూరు వరకు పొడిగించనున్న విశాఖపట్టణం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఈ నెల 9వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉన్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి.

నేటి సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

సాంకేతిక కారణాల వలన శనివారం ఈ నెల 6వ తేదీ గుంటూరు నుంచి విశాఖపట్టణానికి బయలుదేరాల్సిన నెం.17239 సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

బీరువాలోని 34 సవర్ల బంగారం చోరీ

● రూ. 55 వేల నగదు అపహరణ

దాచేపల్లి, జనవరి 5: కుటుంబసభ్యులంతా ఇంట్లో నిద్రిస్తు న్నారు.. బీరువా తాళం వేసింది వేసినట్లే వుంది.. బీరువాలో దాచిన 34 సవర్ల బంగారం, రూ.55వేల నగదు చోరీకి గురయ్యాయి. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు శుక్రవారం తెలిపిన వివరాలిలా వున్నాయి. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన యర్రగడ్డ సైదులు ఇంట్లోని బీరువాలో 34 సవర్ల బంగారాన్ని, దేవుడి రూములో మరో రూ.55వేల డబ్బులు వుంచాడు. బ్యాంక్‌లో గోల్డ్ లోన్ తీసుకునేందుకు గాను బీరువాలో బంగారాన్ని దాచి వుంచాడు. తెల్లవారుజామున లేచి చూసే సరికి బీరువా తెరిచివుండటాన్ని గమనించి ఆందోళనకు గురయ్యారు. బీరువాను పరిశీలించి చూడగా గురువారం రాత్రి బీరువాలో దాచిన బంగారం మూట కనపడకుండా పో యింది. దేవుడి రూములో దాచిన రూ.55వేల నగదు కూడా మాయమైంది. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. డాగ్ ఇంట్లోనే చాలాసేపు తచ్చాడినట్లుగా తెలుస్తోంది. సైదులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	186.00
చికెన్ స్కిన్ లెస్	196.00

పల్నాడు వార్తలు

పింఛన్లు పంపిణీ

పిడుగురాళ్ల, జనవరి 5 : పురపాలక సంఘం పరిధిలో నాగులగుడి, శివాలయం బజారు, గాంధీనగర్, ఎల్ఐసి కృష్ణారావు బజారులో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎండీ గఫార్, వీరభద్రుని రామిరెడ్డి, కొమెర వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు వున్నం భారతి, హజ్మీరా శారద ఉన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

పిడుగురాళ్ల, జనవరి 5 : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 25 రోజులుగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్లలో ఆర్అండ్‌బి బంగ్లా వద్ద అంగన్‌వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 25 ఆకారంలో ప్రధాన రోడ్డుపై అంగన్‌వాడీలు కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హజ్రా, శాంతమణి, సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీనివాసరావుతో పాటు శివరంజని, ఊర్మిళ, కవిత, సుజాత, అరుణ, జయశ్రీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విధుల్లో చేరాలని ఒత్తిళ్లు

సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు వెంటనే విరమించి శుక్రవారంలోగా విధుల్లో చేరాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, అధికారులు ఒత్తిళ్లు తీసుకురావడం ఎంతమాత్రం తగదని అంగన్‌వాడీ మండిపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలతో ఉద్యమాన్ని, ఆందోళనను ఆపలేరని హెచ్చరించారు.

● సత్తెనపల్లి, జనవరి 5 : సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో తాలుకా సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. సమ్మెలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఒంటి కాలిపై నిల్చొని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెండాల మహేష్, సుజాత, అహల్య, ధనలక్ష్మి, చాముండేశ్వరి, దుర్గా భవానీ, ముప్పాళ్ళ, రాజుపాలెం, సత్తెనపల్లికి చెందిన అంగన్‌వాడీలు, ఆయాలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో ఒంటి కాలుపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

● అమరావతి, జనవరి 5 : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన దీక్షలు 25వ రోజు పురస్కరించుకుని ధ్యానబుద్ధ ప్రాంగణంలో 25 సింబల్ కనిపించే విధంగా కూర్చుని తమ నిరసన తెలిపారు. తొలుత దీక్షా శిబిరం వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.బాబు పాల్గొని తన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగనవా డీ కార్యకర్తలతో పాటు సీఐటీయూ మండల నాయకుడు బి.సూరిబాబు పాల్గొన్నారు.

● క్రోసూరు, జనవరి 5 : రాష్ట్రంలో ఉధృతంగా సాగుతున్న అంగన్ వాడీల ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వం కుట్ర చేస్తుం దని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జీ.మల్లేశ్వరి విమర్శించారు. అంగన్ వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవా రం 25వ రోజుకు చేరుకుంది. క్రోసూరులో దీక్షా శిబిరాన్ని మల్లేశ్వరి సందర్శించి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు అనేక రకాలైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు, పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయలక్ష్మి, శివ పార్వతి పాల్గొన్నారు.

● పెదకూరపాడు, జనవరి 5 : అంగన్‌వాడీల న్యాయ మైన కోర్కెలను పరిష్కరించటంలో ప్రభుత్వం విఫలమైందని తెలుగు నాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొల్లి లక్ష్మీనరసమ్మ అన్నారు. పెదకూరపాడు మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీలు ఆకులు తింటూ నిర వధిక సమ్మెను నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు చెరుకూరి సాంబ్రాజ్యం, బోడపాటి నాగ జ్యోతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరిన పలువురు ఎస్సీ నేతలు

భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదే

● **నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ**

సత్తెనపల్లి, జనవరి 5 : భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు శుక్రవారం పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఏకుల వెంకటేశ్వరరావు, ఎస్.మరియదాసు, మాలపాటి నవీన్ బాబు, దమ్ము డేవిడ్, టి.విజయ బాబు, పిల్లి కిరణ్, పిల్లి భాస్కర్, జనుపల్లి సుజిత్, నందిగామ జీవన్, జీ.గుణలత, రాయల పిచ్చయ్య, టీ.వాసు, మల్లవరపు అశోక్‌కు చెందిన 25 కుటుంబాల సభ్యులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీ నారాయణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిని పార్టీలో చేర్పించిన టీడీపీ నేతలు ఎల్.రవి, చిలకా నరేష్, బి.సురేష్‌కుమార్‌లను కన్నా అభినందించారు.

● సత్తెనపల్లి పట్టణ సోషల్ మీడియా అధ్యక్షుడిగా షేక్ నూరు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా గంగూరి వెంకటేశ్వరరావును నియమిస్తూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు సుధాకరరెడ్డి, ఆతుకూరి నాగేశ్వరరావు, బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం ఉన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం : కన్నా

సత్తెనపల్లి జనవరి 5: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో శుక్రవారం రాత్రి ముప్పాళ్ళ మండల క్లష్టర్ సమావేశం జరిగింది. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ముప్పాళ్ళ మండలంలో భవిష్యత్ గ్యారంటీ 60శాతం పూర్తిచేసిన బూత్ కమిటీ ఇన్‌చార్జిలను కన్నా లక్ష్మీనారాయణ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు రావిపాటి నానయ్య, పచ్చల నాగేశ్వరరావు, అత్తోట కృష్ణ, వెంకటేశ్వర్లు, రావిపాటి మధుబాబు, డబ్బుకొట్టు నారాయణ, గంగారాం ఖాశిం, నూర్‌భాషా జానీబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు మృతికి టీడీపీ నేత శౌరయ్య సంతాపం

నకరికల్లు, జనవరి 5 : నకరికల్లు యానాది కాలనీలో నివాసం ఉంటున్న తలపల వెంకటేశ్వర్లు భౌతిక కాయంపై శుక్రవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు దూదేకుల హస్సేన్‌బీ, తిరుమలశెట్టి వెంకటరావు, షేక్ జాన్, ఢీకొండ మహానంది, సంగుల అప్పారావు, గోపిశెట్టి వెంకట శివయ్య, గుజ్జుల పోలు, మొల్లాల రాఘవరావు తదితరులు ఉన్నారు.

8, 9 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు

సత్తెనపల్లి, జనవరి 5 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో పట్టణంలోని విద్యా కేంద్రం కళాశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు, మహిళల ఇన్విటేషన్ టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు దరువూరి నాగేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో గల కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీలకు ముఖ్య అతిథులుగా కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర, యరపతినేని శ్రీనివాసరావు, జీవీ అంజనేయులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య హాజరవుతారన్నారు. జాతీయ క్రీడాకారుడు మల్లాది అర్జున, రిటైర్డు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ చింతల వెంకటేశ్వర్లును సన్మానించటం జరుగుతుందన్నారు. ఉత్సాహవంతులైన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

సమాజంలో స్త్రీల ప్రాముఖ్యత పెరుగుతుంది : అంబటి

సత్తెనపల్లి జనవరి 5 : సమాజంలో స్త్రీల ప్రాముఖ్యత పెరుగుతుందని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో శుక్రవారం బంగారుతల్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరికరాలను ప్రారంభించారు. అనంతరం కేకు కట్ చేసి ఆడ పిల్లల తల్లులకు పంపిణీ చేశారు. ఫొటో జ్ఞాపికలను వారికి అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, కొత్త రామకృష్ణ, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల పట్టణాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, జనవరి 5 : పట్టణాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన సైడు డ్రెయిన్, వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, అబ్దుల్ జలీల్, మదార్‌సాహెబ్, పోలూరి నరసింహారావు, బోయ రఘురామిరెడ్డి, సుభానిసాహెబ్, లెనిన్, మస్తాన్ పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

వెల్దుర్తి, జనవరి 5: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రెంటచింతలలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు పెరిగిన పింఛన్ రూ.3 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్య, మండల ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, బాలు నాయక్, పులుసు నారాయణరెడ్డి, సర్పంచ్ బలిగొడుగుల శ్రీనివాస్ యాదవ్, శీలం సైదారెడ్డి, తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరుకున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

సత్తెనపల్లి, జనవరి 5 : సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరుకుంది. మునిసిపల్ కార్యాలయం వద్ద వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో వంగిపురపు చంద్రకళ, చింతగుంట్ల వెంకయ్య, మేడి సత్యవతి, జే.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● దాచేపల్లి, జనవరి 5 : ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరశిస్తూ శుక్రవారం కార్మికులు భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. దాచేపల్లి, నారాయణపురంలో ప్రధాన వీధుల్లో పారిశుధ్య కార్మికులు ప్రభుత్వం తమ పట్ల అనుసరిస్తున్న వైఖరిని ప్రజలకు తెలియజేశారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

దుర్గి, జనవరి 5 : నాటుసారా, అక్రమ మద్యం తరలింపులో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు మండల కేంద్రమైన దుర్గి పోలీస్ స్టేషన్లో శనివారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

జిల్లాలో లబ్ధిదారులకు రూ.4.18 కోట్లు: కలెక్టర్

నరసరావుపేట అర్బన్, జనవరి 5: పల్నాడు జిల్లాలో 2785 మంది లబ్ధిదారులకు రూ.4.18కోట్ల మేర నగదు వారి ఖాతాల్లో జమ అయినట్టు కలెక్టర్ శివశంకర్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అర్హత ఉండి లబ్ధిపొందని వారికి ఈ నగదు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

● ఐఏఎస్ అకాడమి స్టడీ సర్కిల్ అధినేత డాక్టర్ పారా లక్ష్మయ్య

నరసరావుపేట టౌన్, జనవరి 5: ఎన్టీఆర్ విద్యోన్నతి ప్లస్, వెంకటపతి విద్యోన్నతి ద్వారా పేద విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందజేస్తామని ఐఏఎస్ స్టడీ సర్కిల్ అధినేత డాక్టర్ పారా లక్ష్మయ్య వెల్లడించారు. శుక్రవారం నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పారా లక్ష్మయ్య మాట్లాడుతూ చదువుకోవాలనే ఆసక్తి ఉండి ఆర్థిక సమస్యలలో ఉన్న పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అభ్యర్థన మేరకు పల్నాడు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో వందమంది పేద విద్యార్థులకు ఆన్‌లైన్ కోచింగ్ ఇచ్చేవారమని, ఇప్పుడు ఎంతమంది అభ్యర్థులు వచ్చినా ఉచిత కోచింగ్ అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆన్‌లైన్ క్లాసులు వినుకొండ నుంచి జరుగుతాయని తెలిపారు. పల్నాడు ప్రాంతం నుంచి గ్రూప్ ఎగ్జామ్‌కు ఎక్కువమంది ఎంపిక కావడమే ముఖ్య ఉద్దేశమన్నారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వెంకటపతి మోమోరియల్ ట్రస్ట్ తరఫున పారా లక్ష్మయ్య పల్నాడు ప్రాంత విద్యార్థులకు ఉచిత కోచింగ్ విధానం తీసుకురావడం అభినందనీయమన్నారు.

బ్రెయిలీకి కలెక్టర్ ఘన నివాళి

నరసరావుపేట కల్చరల్, జనవరి 5: స్థానిక అంధుల పాఠశాలలో జరిగిన బ్రెయిలీ జయంతి వేడుకల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల కోసం ప్రత్యేక లిపిని తయారుచేసి బ్రెయిలీ ఆరాధ్యదైవం అయ్యాడని తెలిపారు. అంధుల్లో ఆత్మవిశ్వాసం నింపిన గొప్ప మహనీయుడన్నారు. బ్రెయిలీ బతికుండగా ఆయన లిపిని ఎవరూ పట్టించుకోలేదని, ఆయన మరణానంతరం నాటి ఫ్రెంచి ప్రభుత్వం దానిని అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల శాఖ అధికారి సువార్త, పాఠశాల ఆధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇరుకుటుంబాల మధ్య ఘర్షణ: 8మందిపై కేసు

కారుమంచి (శావల్యాపురం) జనవరి 5: మండలంలోని కారుమంచిలో ఇరుకుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో 8మందిపై కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ తుళ్ళూరి తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. కారుమంచి గ్రామానికి చెందిన కిలారు సూర్యనారాయణ, కిలారు చంద్రశేఖర్ కుటుంబాల మధ్య గత కొన్ని రోజులుగా స్థలాల విషయంలో వివాదం జరుగుతోంది. చంద్రశేఖర్ ఇంటికి మెట్లు కట్టుకునే విషయంలో గురువారం రాత్రి ఘర్షణ జరిగి, పలువురు స్వల్పంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరుకుటుంబాల నుంచి నలుగురు చొప్పున మొత్తం 8మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాగ్దేవి డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు

నరసరావుపేట టౌన్, జనవరి 5: నరసరావుపేట పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ గుర్తింపు ఇచ్చిందని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాదు శుక్రవారం తెలిపారు. బెంగుళూరులోని నాక్ సంస్థ ప్రధాన కార్యాలయం ఈ విషయాన్ని ప్రకటించి బీ ప్లస్ గుర్తింపు సర్టిఫికేట్‌ను కళాశాలకు పంపించారన్నారు. బీ ప్లస్ గుర్తింపు వచ్చిన సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ పీ రాజశేఖర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీసీ అభినందించారు.

హ్యాండ్ బాల్ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ విద్యార్థిని ఎంపిక

నరసరావుపేట టౌన్, జనవరి 5: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం హ్యాండ్ బాల్ జట్టుకి కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి కే భాగ్యశ్రీ ఎంపికైందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఏఎన్‌యూ అంతర కళాశాలల మహిళల హ్యాండ్ బాల్ పోటీలు ఈ నెల 4న తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో నిర్వహించారు. ఇందులో కే భాగ్యశ్రీ ఎంపికైందన్నారు. ఈ నెల 8నుంచి చెన్నైలోని పెరియార్ యూనివర్శిటీలో దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయ పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు కే భాగ్యశ్రీ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. భాగ్యశ్రీని పీడీ ఈదర ఆదిబాబు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఇమ్యూనైజేషన్ అధికారి

రొంపిచర్ల, జనవరి 5: మండలంలోని వడ్లమూడివారిపాలెంలో ఆరోగ్య సురక్షా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి గీతాంజలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు, మందులను పరిశీలించారు. వైద్యాధికారులకు సూచనలను చేశారు. వైద్యులు జగన్ నరసింహారెడ్డి, సాయి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

● అంగన్‌వాడీ సంఘాల హెచ్చరిక



నరసరావుపేటలో నోరు, కళ్ళు, చెవులు మూసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నరసరావుపేట టౌన్, జనవరి 5: ప్రభుత్వం తమ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ సంఘ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నోరు, కళ్ళు, చెవులు మూసుకొని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఏఐటీయూసీ, సీఐటీయు, ఐఎఫ్‌టీయూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా 25వ రోజు అంగన్‌వాడీలు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీపార్కు వద్ద ఆందోళ నిర్వహించారు.

నిరవధిక దీక్ష చేస్తాం: ఏఐటీయూసీ ప్రాజెక్టు లీడర్

అంగన్‌వాడీలు 25 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నామని, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని, ప్రభుత్వం మొండివైఖరి విడనాడక పోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని ఏఐటీయూసీ నరసరావుపేట ప్రాజెక్టు లీడర్ శోభరాణి హెచ్చరించారు. అంగన్‌వాడీల బాధలు ప్రభుత్వానికి కనబడటం లేదని సీఐటీయు నరసరావుపేట ప్రాజెక్టు కార్యదర్శి నిర్మలా అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి కేపీ మెటీల్డాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె

వినుకొండ, జనవరి 5: సురేష్‌మహల్ రోడ్డులో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు 25వ రోజుకు చేరాయి. శుక్రవారం ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మారుతివరప్రసాద్, హనుమంతరెడ్డిలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన కోర్కెలు పరిష్కరించేంతవరకు సమ్మెను విరమించేది లేదన్నారు. ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శివరామకృష్ణ, ఆశీర్వాదం, సత్యనారాయణ, లక్ష్మీప్రసన్న, శారమ్మ, మున్ని, ఉమాశంకరి, కృష్ణకుమారి, నిర్మలాదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పొర్లు దండాలతో మున్సిపల్ కార్మికుల నిరసన



నరసరావుపేటలో పొర్లు దండాలు, చిలకలూరిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు



వినుకొండలో అర్ధనగ్నప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నరసరావుపేట టౌన్, జనవరి 5: మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలియజేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 11వ రోజు పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఐఏఎస్ అకాడమి స్టడీ సర్కిల్ అధినేత డాక్టర్ పారా లక్ష్మయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ కార్యదర్శి సాల్మన్, కార్మికులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేట మునిసిపాలిటీలో మూడు రోజులుగా సమ్మె చేస్తున్న వివిధ విభాగాలకు చెందిన మునిసిపల్ కార్మికులు శుక్రవారం మూడోరోజు సమ్మె కొనసాగించారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ మాట్లాడుతూ కార్మికులు భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కే చెంచయ్య, యోగ్య, బాబూరావు, పీ రామారావు, వరహాలు, సీహెచ్ నిర్మల, వివిధ సంఘాలకు చెందిన ఆవుల పోతురాజు, పెద్ద నాగేశ్వరరావు, వీ హక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్మికులు చేస్తున్న సమ్మెకు జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి నిశ్శంకరావు శ్రీనివాసరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలే తప్ప సమస్యను జటిలం చేయరాదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాసరయ్య, పోలరాజు, ఉషారాణి, శ్రీనివాస్‌తో పాటుమున్సిపల్ కార్మిక నాయకులు అబ్రహాం, రాజు, పచ్చిగొర్ల ఏసు, కంచర్ల కోటేశ్వరరావు, సాయి, రాచపూడి ఏసుపాదం, సంపెంగుల జాన్, దేవమ్మ, గురవమ్మ, కొండమ్మ, నాగరాణి, రాహేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామోదయంతో సమస్యల పరిష్కారం

కనమర్లపూడిలో కలెక్టర్ శివశంకర్



కనమర్లపూడిలో బాలికలతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కనమర్లపూడి(శావల్యాపురం), జనవరి 5: గ్రామాల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామోదయం కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ శివశంకర్ తెలిపారు. మండలంలోని కనమర్లపూడిలో శుక్రవారం ఆయన పర్యటించారు. కోతుల బెడద, డ్రెయినేజీ, విద్యుత్ లైన్లు తదితర సమస్యలను బీసీ కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కోతులను పట్టించాలని, ఇళ్లను అనుకుని ఉన్న కరెంట్ తీగలకు వెంటనే పైపులను తొడగాలని అధికారులను ఆదేశించారు. 2వ విడత గడప గడపకు మన ప్రభుత్వంలో డ్రెయినేజీల నిర్మాణాలు చేపడతామన్నారు. బడికి వెళ్తున్న విద్యార్థునులను ఆపి హిమోగ్లోబిన్ శాతంపై ప్రశ్నించి, ఆ పరికరం లేకుండా వచ్చిన వైద్యసిబ్బందిని మందలించారు. మూతపడిన డంపింగ్ యార్డుకు గ్రీన్‌అంబాసిడర్‌ను నియమించాలని, వాటర్ ప్లాంట్ వినియోగంలోకి తేవాలన్నారు. పాఠశాలలో బంగారుతల్లి కార్డులు తనిఖీ చేసి, తప్పుల నమోదుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎస్సీ కాలనీ పాఠశాలలో తనిఖీ చేశారు. గ్రామంలో పట్టపగలే వీధిలైట్లు వెలిగి ఉండడంతో అధికారులను మందలించారు. సురక్ష-2 కార్యక్రమాన్ని పరిశీలించారు. డీఈవో శ్యామ్యూల్, డీఎల్‌డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, ఈవోపీఆర్డీ సుగుణ, ఎంఈవో సాంబశివరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ నాసరయ్య, మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● బైకును లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఘటన

త్రిపురాంతకం, జనవరి 5: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని గుట్లఉమ్మడివరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొత్తచెరువుకొమ్ముపాలేనికి చెందిన పసుమర్తి వెంకటరమణ (69) అనే మహిళ తన కుమారుడు అంజయ్య కలిసి మండలంలోని ఒడ్డుపాలెంలో బంధువుల ఇంటికి వెళుతోంది. ఈ నేపథ్యంలో గుట్లఉమ్మడివరం వంతెన సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో వెంకటరమణ రోడ్డుపై పడడంతో బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం కోసం వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 5: మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెంలో నూతనంగా నిర్మించిన అంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు.

నేను ప్రజలనే నమ్ముకున్నా: ఎమ్మెల్యే బొల్లా

వినుకొండటౌన్, జనవరి 5: తాను ఏ తప్పు చేయలేదని, నాయకుల కంటే ప్రజలనే నమ్ముకున్నానని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. స్థానిక జాషువా కళాప్రాంగణ ఆవరణలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బొల్లా మాట్లాడుతూ తాను తప్పు చేశానని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు.



కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

కొనసాగుతున్న ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్నదానం

చిలకలూరిపేట అర్బన్, జనవరి 5: పట్టణంలోని కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో శుక్రవారం 630 మంది పేదలు, వలస కూలీలకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ కరీం, షేక్ ఉమర్, షేక్ ఖాజా, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జవ్వాజి బుచ్చిబాబు తదితరులు సేవలు అందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిలకలూరిపేట అర్బన్, జనవరి 5: పట్టణంలోని మద్దినగర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి ఇటీవల గుండెపోటుతో మరణించటంతో విషయం తెలిసిన మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు తన ప్రగాఢ సానుభూతిని తెలిపి వారి ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వారి కుటుంబానికి రూ.20వేలు సాయం అందించారు. కార్యక్రమంలో ముల్లా, కరిముల్లా, యూనిట్ ఇన్‌చార్జ్ బ్లీడింగ్ కరిముల్లా, అత్తర్ మీరాసా, షేక్ సాయిబాబు, తన్నీరు పుల్లారావు, షేక్ రహీం, షేక్ బషీరూన్, షేక్ ముస్తఫా, షేక్ సర్దార్, ఆర్మీ బాజీ, భారీసైదా, షేక్ ఇమ్రాన్, షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతి

యడ్లపాడు, జనవరి 5: వారసత్వంగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ యడ్లపాడు మండలం వంకాయలపాడు ఎస్సీ కాలనీవాసులు తహసీల్దార్ కుటుంబరావును కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌ను కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. గ్రామపరిధిలోని య.5.89 శెంట్ల ప్రభుత్వ భూమిని 1974లో పూర్వీకులు తొమ్మిది మందికి సాగునిమిత్తం పంపిణీచేసి పట్టాలు కూడా ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సదరు భూములు తమవంటూ యడ్లపాడుకు చెందిన వైసీపీ నాయకుడు నకిలీ పత్రాలను సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేయగా అడ్డుకోవడంతో కోర్టుకు వెళ్ళాడని, కోర్టులో భూములు నాయకుడికి చెందినవి కావని తీర్పు వచ్చిందన్నారు. వారసులమైన తమకు పట్టాలు ఇప్పించి భూములపై హక్కులు కల్పించాలని తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు.

అసిస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేట, జనవరి 5: స్థానిక సేవా సంస్థ అసిస్ట్, సీడ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సుభానీ నగర్‌లో 250 మంది ఒంటరి, నిరుపేద మహిళలకు సుమారు రూ.5 లక్షలు విలువ చేసే నిత్యావసరాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు పాల్గొని అసిస్ట్ సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు, ఆపరేషనల్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్, విష్ణు ప్రియ, మునిసిపల్ వైస్‌చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థులకు వైద్య శిబిరం

చిలకలూరిపేట, జనవరి 5: చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు నిపుణులైన డాక్టర్లతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ తుంగల నాగ శ్వేత (చర్మ వ్యాధి నిపుణులు), డాక్టర్ నందం భువనేశ్వరి (దంత వైద్య నిపుణులు, డాక్టర్ జాడ జతిన్ దేవ్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ మహర్షి మనోహర్ (నేత వైద్య నిపుణులు) పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసరావు, స్టాఫ్‌నర్సు కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

7న ఒయాసిస్ వార్షికోత్సవం

చిలకలూరిపేట, జనవరి 5: స్థానిక సేవా సంస్థ ఒయాసిస్ 17వ వార్షికోత్సవం 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కందిమళ్ళ జయమ్మ శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు పట్టణంలోని నన్నపనేని వెంకటరత్నం కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పార్వతీదేవి ఆలయంలో రాజేష్‌నాయుడు పూజలు

బోయపాలెం (యడ్లపాడు), జనవరి 5: జాతీయరహదారి పక్కన యడ్లపాడు మండలం బోయపాలెంలోని పార్వతీదేవి అమ్మవారిని వైసీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉన్నవ, బోయపాలెం గ్రామాల్లోని నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, జనవరి 5: పది మద్యం సీసాలను కలిగి ఉన్న కేసులో నిందితుడైన నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ మీరాసాను అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. నిందితుడు అక్రమంగా పది మద్యం సీసాలను కలిగి ఉండగా శుక్రవారం గుండ్లపల్లిలో అరెస్టు చేశామన్నారు.